



# ఆలిండియా రేడియో

**మా** ఊరికి కరెంటు వచ్చిన కొద్దిరోజులకి మా నాన్నగారికి పెదనందిపాడు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ ఊళ్ళో కరెంటు లేదు.

వాడకపోతే మూలపడిపోతుందని మా దగ్గర ఉన్న రేడియో మా తాతగారింటికి తరలించారు. 'అయ్యో! వద్దు నాయనా. అల్లుడి వస్తువులు వాడుకోవడం అప్రతిష్ఠ' అని తాతగారు అన్నా లెక్కచెయ్యలేదుట.

"ఫర్వాలేదులెండి. ఫ్యాన్లు అవీ గుంటూరు పంపిస్తున్నాను. ఇక్కడ రేడియో లేదుగా, అందుకే ఇక్కడ ఉండనివ్వండి. ఇక్కడైతే భద్రంగా ఉంటుంది" అన్నారుట. రేడియో పెట్టగానే అయిపోయిందా! అదెలా వాడాలో చెప్పాలిగా. రెండు గంటలు బోధించారుట. అయితే అన్నీ విని "అట్లా ఊరూరూ తిరగలేంలెండి. విజయవాడలో ఉండనివ్వండి" అన్నారుట. విజయవాడ స్టేషను అయినా హైదరాబాదు స్టేషను అయినా ఒకటే అని నచ్చచెప్తే మీరేదో గౌరవంకొద్దీ చెప్తున్నారుగానీ విజయవాడ ఎక్కడ? హైదరాబాదు ఎక్కడ? అన్నారుట.

సరే! చివరికి విజయవాడలోనే ముల్లు ఉండేలా సవరించి ఉంచారు నాన్నగారు. తెల్లవారి ఆరుగంటలకు స్విచ్ ఆన్ చేసుకునేవారు. ప్రసార సమాప్తి కాగానే ఆపేసేవారు. రేడియోవచ్చాక పూజ తగ్గించానని మీ అత్తగారు సణుగుతోంది గానీ నాకు బాగా కాలక్షేపం అవుతోంది అని ఉత్తరం రాశారు వారంరోజుల తర్వాత.

"నాతోపాటు దగ్గరున్నవాళ్ళు పదిమంది దాకా వచ్చి రేడియో వింటున్నారు. అలా మందలకొద్దీ జనం వింటే రేడియో శక్తి తగ్గిపోతుందని మీ అత్తగారు గొడవ చేస్తోంది. అంతేనంటారా? మీరే విషయం కార్డుముక్క రాస్తే కావాలంటే అందరినీ తోలేసి నేనొక్కడినే వింటాను" అని రాశారు మరో పక్షం తర్వాత.

నాన్నగారు నవ్వుకుని ఊరుకున్నారు. అమ్మ వెంటనే కార్డు రాసింది. 'ఎంత మంది విన్నా ఏమీకాదు. అమ్మ సణుగుడు పట్టించుకోకండి' అంటూ.

వారం తిరక్కుండానే అమ్మమ్మ దగ్గర్నించి ఉత్తరం. కూతురిమీద కోపం వచ్చింది కాబోలు. చిరంజీవి బాబుకి అంటూ అన్నయ్య పేరు మీదే రాయించింది. నేను చెప్తే వినలేదు. నన్ను ఆట పట్టించారు మీ తాతయ్యా, అమ్మానూ. వసారా పట్టకుండా జనం జేరిపోతే దానికి శోషరాదూ! కాస్త నీరసానపడింది. కంఠంలో ఖంగుతనం తగ్గింది. మూడోనాడు గరగరలాడింది. మర్నాడు మాట పడిపోయింది" అంటూ ఎవరిచేతో రాయించింది. మర్నాడు తాతయ్యగారి ఉత్తరం. ఉభయకుశలోపరి అనంతరం అనేకానేక క్షమాపణలతో మొదలూ 'మీరే వచ్చి చూడాలి. వాళ్ళూ వీళ్ళూ బాగు చేస్తానంటున్నారుగానీ నాకు నమ్మకం లేదు' అని రాశారు. అటువైపు వెళ్ళినపుడు చూసి వచ్చారు నాన్నగారు. రిపేరు ఏంలేదు. చిమ్మెట లోపలికి దూరి ముల్లు కదిపేసింది అన్నారుట.

ఏది ఏమైనా అల్లుడు మేధావి. అటు కారుగానీ ఇటు రేడియోగానీ క్షణంలో రిపేర్ చేస్తారు అని ఆనందపడ్డారుట ఆ ఆదిదంపతులు. ఆ తర్వాత జనం చేరకుండా కట్టడిచేసిందట అమ్మమ్మ. రెండు నెలలకి అమ్మమ్మ మీద దిగులుగా ఉందని గొడవ చేస్తుంటే మనిషినిచ్చి పంపించారు.

నేను వెళ్ళిన మర్నాడే తాతయ్యగారు ఏదో పనిమీద దమ్మనవారిపాలెం వెళ్ళారు. వెళ్ళేటప్పుడు కరెంటు పోయింది. అందుకే మళ్ళీ కరెంటు రాగానే ఖంగున మోగింది రేడియో. పొయ్యి వెలిగించే ప్రయత్నంలో ఉన్న అమ్మమ్మ కంగారుగా 'వచ్చే వచ్చే'

అంటూ గుమ్మం తట్టుకు పడబోతూ వచ్చి రేడియో ఎదురుగా కూర్చుని కాసేపు విన్నది.

ఆ తర్వాత 'బంగారాలూ' అని నన్ను పిల్చింది. వెళ్ళా.

"ఇక్కడ కూచుని కాస్త రేడియో వినమ్మా. నాకవతల బోలెడు పనుంది" అంది. నాకాశ్చార్యం వేసింది. 'పనుంటే వెళ్ళి చేసుకో' అన్నా. "మరి రేడియో ఎవరు వింటారు?" అంది. "వినకపోతే ఆపెయ్" అన్నాను. "ఆ...ఆ... అమర్యాద కాదుటే" అంది.

"ఏం అమర్యాద...వింటే వింటాం. విసుగేస్తే ఆపేస్తాం" అన్నాను.

"నీకు పెత్తనం ఇస్తే సర్వమంగళం చేసేస్తావు. నా మాట వినవే– ఆపద్దు, రేడియో వినవే" అని బతిమాలింది.

"అలా వినక్కర్లేదు. ఆపేయ్" అన్నాను మొండిగా.

మేము ఇలా వాదులాడుకుంటూ ఉండగానే మంచినీళ్ళు పోసే భ్రమరాంబ వచ్చింది.

"విశాలమ్మ కాస్త కరివేపాకు తెమ్మంది" అంటూ. అమ్మమ్మ ప్రాణం లేచివచ్చింది. "సమయానికి దేవుడల్లే వచ్చావు భ్రమరాంబా. నా ప్రాణం కుదుటపడింది" అంది. "ఏవమ్మా ఏం కష్టం వచ్చిందీ?" అంది భ్రమరాంబ.

"ఆయనేమో ఊరికెళ్ళారు. నేనింకా పొయ్యే వెలిగించలేదు. ఇటు చూడబోతే రేడియో వినాలి. ఈ కొరివికి చెప్తే ఎదురు సమాధానాలు చెప్తోంది. కాస్త కూచుని రేడియో విను. నేను అత్తెసరుపడేసి దేవుడికి చెయ్యి చూపించి వచ్చేస్తాను" అంది అమ్మమ్మ.

"ఎవరో పెద్దాయన మాట్లాడుతున్నాడు. నేనేం వింటాను ఎదురుగా కూర్చుని? నాకు మొహమాటం. ఆ వంటేదో నేనే చేసేస్తాను. నువ్వే విను" అని బావి దగ్గరకు వెళ్ళి స్నానం చేసేసి వంట చేసేసింది. వంటయ్యాక కరివేపాకు కోసుకుని వెళ్ళిపోయింది.

ప్రసార సమాప్తి అయ్యాక నైవేద్యం పెట్టి నాకు అన్నం పెట్టింది అమ్మమ్మ ధుమధుమలాడుతూ.

సాయంత్రం దీపాలు పెట్టే వేళ్టికి కాస్త ముందే వచ్చేసింది విశాలమ్మగారు.

"రా పిన్నీ" అంది అమ్మమ్మ.

"విషయం అంతా భ్రమరాంబ చెప్పింది. నువ్వు రేడియో వినాలిగా, పోనీ కాస్త తోడుగా ఉంటుందని వచ్చా" అంది ఆవిడ.

"ఏం చెప్పమంటావు పిన్నీ. చెప్తే దీనికి అర్థం కాదు. అల్లుడు అంత అభిమానంగా ఇచ్చిన వస్తువు. అప్పుడోసారి పాడైపోతే బాగుచేస్తుంటేనే నా ప్రాణం చచ్చిపోయింది. మనం వినాలనుకున్నప్పుడు చెవులు నిక్కబెట్టుకుని విని తీరుబడిలేదని దాన్ని వదిలేసి వెళ్ళిపోతే మనసు కష్టపెట్టుకుని మళ్ళీ చెడిపోతే ఏం చేస్తాను?" అంది అమ్మమ్మ.

"నిజమే మరి. అయినా ఎవరైనా ఇంటికొచ్చి మాట్లాడుతుంటే మధ్యలో వెళ్ళిపోతామా? ఇదీ అంతే" అంది విశాలమ్మగారు.

"అదికాదు తాతమ్మా. మా ఇంట్లో రేడియో ఆపేస్తాం." అని నేను చెప్పబోతే రలాయించేశారు.

"మీ ఇంట్లో మీ ఇష్టం తల్లీ. అక్కడంటే మీ నాన్న, మీ రాజ్యం. మాకు ఆయన అల్లుడే. ఆ మర్యాద ఉండాల్సిందే" అన్నారు.

సరే ఏడవండి అని ఊరుకున్నా. కుయ్ మని రేడియో నోరు విప్పింది. 'ఆకాశవాణి విజయవాడ కేంద్రం' అంటూ మొదలయింది. ఇద్దరూ మాటాలాపేసి శ్రద్ధగా గుళ్ళో కార్తీక పురాణం విన్నట్లు విన్నారు.

మార్కెట్టు ధరవరలు మొదలయ్యాయి. బెజవాడ మార్కెట్టు పప్పులు, మరోచోట ఉప్పులూ అయ్యాక చేపలు అని మొదలయింది. బొమ్మిడాయిలు, మట్టగుడిసెలు, బొచ్చెలు-ఇలా అన్ని చేపల ధరలూ విన్నారు ముక్కు మూసుకునీ, మొహం మాడ్చుకునీ.

తాతయ్య వచ్చేశారు. హమ్మయ్య అంటూ లేచారు ఇద్దరూ.

"వెళ్తానే అమ్మాయ్. ఏవిటో కంపరంగా ఉంది ఒళ్ళంతా. చెంబుడు నీళ్ళు పోసుకుని ఇంత తిని పడుకుంటాను" అని వెళ్ళిపోయింది తాతమ్మ.

"వంటయ్యిందా?" అన్నారు తాతయ్య.

"నా శార్థం అయింది. ఇంతసేపూ రేడియోతోనే సరిపోయె. ఇంక వంటేం చేస్తాను. ఇదుగో స్నానం చేసి కుంపటి అంటిస్తా" అని వెళ్ళిపోయింది అమ్మమ్మ.

* * *